క్లుప్తంగా

శుభకార్యం

యాడికి: మండల కేంద్రంలోని టీడీపీ కల్యాణ మండపంలో శనివారం వైఎస్సార్‌సీపీ యాడికి 5వ వార్డు మాజీ సభ్యుడు, చౌడయ్య కుమారుడు నాగేంద్ర బాబు, లక్ష్మీల వివాహం జరిగింది. ఈ వివాహ వేడుకలకు తాడిపత్రి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి తనయుడు కేతిరెడ్డి హర్షవర్ధన్ రెడ్డి హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా మండల నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తమ సమస్యలను హర్షవర్ధన్‌రెడ్డికి చెప్పుకున్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ సంజీవరాయుడు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు వెంకటరామిరెడ్డి, మండల సీనియర్ నాయకులు బాలా రమేష్ బాబు, భోగాతి బ్రహ్మానంద రెడ్డి, వేములపాడు రంగారెడ్డి, ఎం.రసూల్ తదితరులు పాల్గొన్నారు.

విత్తన శుద్ధి కేంద్రం తనిఖీ



విత్తనాలను పరిశీలిస్తున్న ఏడీఏ వెంకటరాముడు

గుత్తి: పట్టణంలోని పవన్ ఆగ్రో ఏజెన్సీస్ విత్తన శుద్ధి కేంద్రాన్ని శనివారం ఏడీఏ వెంకటరాముడు ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన శుద్ధి చేసిన విత్తనాలు నింపిన బ్యాగులను పరిశీలించారు. ఏడీఏ మాట్లాడుతూ విత్తన శుద్ధి ప్రక్రియలో నాణ్యత లోపిస్తే చర్యలు తప్పవన్నారు. నాణ్యత ప్రమాణాలను తప్పకుండా పాటించాలన్నారు. కార్యక్రమంలో ఏఓ ముస్తాక్ అహ్మద్, ప్రాసెసింగ్ యూనిట్ ఇన్‌చార్జ్ మెహరున్నీషా బేగం, వ్యవసాయ విస్తరణాధికారి భగవాన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

గార్లదిన్నె: మండలంలోని కనంపల్లిక్రాస్ సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలయ్యాయి. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన మేరకు.. కూడేరుకు చెందిన రామాంజనేయులు వ్యక్తిగత పని నిమిత్తం ద్విచక్ర వాహనంపై పామిడికి వెళ్తుండగా అదుపుతప్పి కిందపడ్డాడు. ఈ ప్రమాదంలో రామాంజనేయులకు కాలుకు విరిగింది. స్థానికులు 108 వాహనంలో చికిత్స నిమిత్తం అతన్ని అనంతపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.

ఉరేసుకుని లారీ క్లీనర్ ఆత్మహత్య



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

పెద్దవడుగూరు: మండల పరిధిలోని గుత్తి అనంతపురం గ్రామ సమీపంలో 220 కేవీ విద్యుత్ లైన్ స్తంభానికి షాహిద్‌ఖాన్ (20) అనే లారీ డ్రైవర్ ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. హర్యానాకు చెందిన షాహిద్‌ఖాన్ లారీ క్లీనర్‌గా పని చేస్తున్నాడు. శనివారం ఫోన్‌లో కుటుంబ సభ్యులతో గొడవపడ్డాడు. అనంతరం గుత్తి అనంతపురం హైవే డాబా వద్ద లారీ ఆపి.. అక్కడి నుంచి నడుచుకుని వెళ్లి చర్చి వెనుక ఉన్న విద్యుత్ లైన్ స్తంభానికి ఉరి వేసుకుని మృతి చెందాడు. అటుగా వెళ్లిన వారు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని కిందకి దించి పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

ఘర్షణలో ఇరువర్గాలపై కేసు నమోదు

యల్లనూరు: మండలంలోని కొడవాండ్లపల్లిలో బోరు విషయంలో ఘర్షణ పడిన ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రామాంజనేయరెడ్డి శనివారం తెలిపారు. గ్రామానికి చెందిన జయరామకృష్ణ, శివకేశవ, సూర్యనారాయణ, చిన్న కృష్ణలు దాయాదులన్నారు. ఈ రెండు కుటుంబాలకు భూ వివాదం ఉందన్నారు. శుక్రవారం వారు భూమిలో బోరు వేసేటప్పుడు ఘర్షణ జరిగిందని, తిరిగి రాత్రి ఒకరినొకరులు దాడులు చేసుకున్నారన్నారు. ఘర్షణలో సూర్యనారాయణ తలకు గాయాలు, జయరామకృష్ణ, శివకేశవకు వాపుడు గాయాలయ్యాయన్నారు. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

పొగాకుతో అనర్థాలు

అనంతపురం: పొగాకు తీసుకోవడం వల్ల చాలా అనర్థాలు తలెత్తుతాయని స్మాల్ ఇండస్ట్రీస్ డెవలప్‌మెంట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా హైదరాబాద్ రీజనల్ మేనేజర్ వి.చంద్రమౌళి అన్నారు. ప్రపంచ పొగాకు నిషేధ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం ఎస్కేయూ వద్ద ఉన్న రూడ్‌సెట్ సంస్థలో భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు, క్రీడా మంత్రిత్వ శాఖ, మేరా యువ భారత్ సంయుక్తంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా మాట్లాడారు. రూడ్‌సెట్ డైరెక్టర్ విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలకే పరిమితం..!

- అర్ధంతరంగా నిలిచిపోయిన రెండు జిల్లాలను కలిపే రూ.24 కోట్ల బ్రిడ్జి పనులు
- ప్యాచ్ వర్క్‌ల పేరుతో అరకొర నిధుల విడుదల
- కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజల అసహనం



అర్ధంతరంగా నిలిచిపోయిన చిత్రావతి బ్రిడ్జి పనులు

తాడిపత్రి రూరల్: తాము అధికారంలోకి వస్తే గ్రామీణ రోడ్లను విస్తరించి బాగు చేస్తాం.. నిలిచిపోయిన బ్రిడ్జి పనులకు నిధులు కేటాయిస్తామని బీరాలు పలికిన కూటమి ప్రభుత్వ పెద్దలు అధికారంలోకి రాగానే కేవలం ప్యాచ్ వర్క్‌ల పేరుతో అరకొర నిధులు విడుదల చేసి చేతులు దులుపుకున్నారు. కూటమి ప్రభుత్వ తీరుపై ప్రజల్లో అసహనం వ్యక్తమవుతోంది. చంద్రబాబు చెప్పింది ఒకటి.. చేసింది ఒకటి అంటూ మండిపడుతున్నారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి పది నెలల క్రితం పంపిన రూ.197 కోట్ల రోడ్ల విస్తరణ ప్రతిపాదనలు ఇందుకు ఉదాహరణగా చెప్పుకోవచ్చు. ఎన్నికల్లో గెలిచిన తరువాత జూలై నెలలో దాదాపు రూ.197 కోట్లతో తాడిపత్రి ఆర్ అండ్‌బీ శాఖ పరిధిలో శింగనమల నియోజకవర్గంలోని పుట్లూరు, యల్లనూరు, శింగనమల, గార్లదిన్నె మండలాల్లో రోడ్ల విస్తరణ, చిత్రావతి నదిపై బ్రిడ్జి నిర్మాణం తదితర పనులకు సంబంధించి నిధుల మంజూరుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు. ప్రతిపాదనలు పంపించి 10 నెలలు దాటినా నయాపైసా కూడా విడుదల కాలేదు. పంపిన ప్రతిపాదనలు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నాయో లేక చెత్త బుట్టలోకి వెళ్లాయో తెలియని దుస్థితి నెలకొంది. ఈ నిధులతో రోడ్ల విస్తరణ జరిగితే వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఉండదని ప్రజలు సంతోషించారు. ఈ పనుల ద్వారా తమ ఉపాధి దొరుకుతుందని ఆశించిన కూలీలు, సబ్ కాంట్రాక్టర్లు ఆశలపై ప్రభుత్వ నీళ్లు చల్లింది.

ఇబ్బందులు పడుతున్న ప్రజలు

అనంతపురం-కడప జిల్లాలను కలిపే చిత్రావతి బ్రిడ్జి పనులు అర్ధంతరంగా ఆగిపోయాయి. చిత్రావతి నదికి వచ్చే నీటి ప్రవాహం వల్ల రెండు జిల్లాలకు నిలిచిపోతున్న రాకపోకలను దృష్టిలో ఉంచుకుని అప్పటి మల్లాగుండ్ల ప్రజల ఒత్తిడి మేరకు టీడీపీ ప్రభుత్వం 2018లో బ్రిడ్జి నిర్మాణానికి మొదట రూ.16 కోట్లను మంజూరు చేసింది. ఈ నిధులు సరిపోవంటూ మరో రూ.8 కోట్లకు ప్రతిపాదనలు పంపారు. మొత్తం రూ.24 కోట్లతో పనులను ప్రారంభించారు. పనులు పిల్లర్ల వరకే పరిమితమయ్యాయి. బ్రిడ్జి నిర్మాణం పూర్తి కాకపోవడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలం వస్తే రెండు జిల్లాల రవాణా వ్యవస్థ నిలిచిపోతుంది. ఈ పనుల పునరుద్ధరణ కోసం పంపిన ప్రతిపాదనలు సైతం ఆచరణకు నోచుకోలేదు. నిధులు మంజూరువుతాయి.. టెండర్ల ప్రక్రియ పూర్తి అవుతుందని కూటమి నాయకులు చెబుతున్నారే తప్ప ఎప్పుడు అమలు అవుతాయో చెప్పలేకపోతున్నారు.

త్వరలో నిధుల మంజూరు



పంపిన ప్రతిపాదనలకు త్వరలో నిధులు మంజూరు కానున్నాయి. అప్పట్లో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు రోడ్ల విస్తరణ, చిత్రావతి నదిపై బ్రిడ్జి పునరుద్ధరణ పనుల కోసం రాష్ట్ర ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. నిధులు వచ్చిన వెంటనే టెండర్లు పక్రియ పూర్తి చేసి పనులు చేపడుతాం.

– రమేష్ నాయక్, డీఈ, ఆర్‌అండ్‌బీ

ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలి





ప్లాస్టిక్ నివారణపై ర్యాలీ నిర్వహిస్తున్న పంచాయతీ సిబ్బంది, మాట్లాడుతున్న కమిషనర్ నయీమ్ అహ్మద్

గుంతకల్లు: సింగల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లు నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మున్సిపల్ కమిషనర్ నయీమ్ అహ్మద్ పేర్కొన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో పట్టణ వ్యాపార సంఘాల నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 5న ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా పట్టణంలో ఏ దుకాణంలో కూడ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ కవర్లను వాడరాదన్నారు. తమ దాడులు చేసినప్పుడు కవర్లు దొరికితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, హెల్త్ అసిస్టెంట్లు, మేస్త్రీలు, శానిటరీ సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

యోగా డే జయప్రదం చేయండి

జూన్ 21న యోగా డేను జయప్రదం చేయాలని కమిషనర్ నయీమ్ అహ్మద్ విజ్ఞప్తి చేశారు. శనివారం తన చాంబర్‌లో యోగా డే ఏర్పాట్లుపై యోగా శిక్షకులతో సమావేశం ఏర్పాటు చేశారు. యోగా డేలో ప్రజలు విరివిగా పాల్గొనేలా ప్రతి ఇంటికి వెళ్లి అవగాహన కల్పించాలని కోరారు.

ప్లాస్టిక్ రహిత సమాజం కోసం కృషి

పెద్దవడుగూరు: మండలంలోని ప్రజలందరూ ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలని పెద్దవడుగూరు సర్పంచ్ వరలక్ష్మి, పంచాయతీ కార్యదర్శి లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. శనివారం మండల కేంద్రంలో ప్లాస్టిక్ కవర్లను నిషేధించాలని కోరుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వలన కలిగే నష్టాలను వివరించారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లను ఎవ్వరూ వాడవద్దని సూచించారు. చెత్త చెదారాన్ని ఎక్కడ పడితే అక్కడ వేయకుండా పారిశుద్ధ్య కార్మికుల వాహనాలు వచ్చినప్పుడు అందించాలని తెలిపారు. తద్వారా పంచాయతీని ఆదర్శవంతంగా తీర్చిదిద్దవచ్చని పేర్కొన్నారు. అనంతరం దుకాణాల వద్దకు వెళ్లి ప్లాస్టిక్‌ను వాడొద్దని అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

1 నుంచి ప్లాస్టిక్ నిషేధం

పెద్దపప్పూరు: జూన్ 1 నుంచి మండల వ్యాప్తంగా ప్లాస్టిక్ నిషేధం అమలు చేయనున్నట్లు ఎంపీడీఓ శంకుంతల తెలిపారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ సిబ్బందితో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్రతి ఒక్కరూ సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా నిషేధించాలన్నారు. భూమిలో కలిసిపోయే జూట్, గుడ్డతో తయారు చేసిన బ్యాగులనే వాడాలని సూచించారు. ప్లాస్టిక్ నిషేధంపై మండలంలోని ప్రతి గ్రామంలో అవగాహన సదస్సులు నిర్వహించాలని సిబ్బందికి వివరించారు.

సాగునీటి కోసం ఐక్య ఉద్యమాలకు శ్రీకారం



విలేకరులతో మాట్లాడుతున్న జగదీష్

గుంతకల్లు: ఉమ్మడి అనంత జిల్లాలో సాగునీటి కోసం ఐక్య ఉద్యమాలకు శ్రీకారం చుడదామని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు డీ.జగదీష్ పేర్కొన్నారు. శనివారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ఇటీవల ఎమ్మెల్సీ శివరామిరెడ్డి, ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు సవాళ్లు, ప్రతి సవాళ్లు చేసుకున్నారని, ఇలాంటి వాటితో ఎలాంటి లాభం లేదన్నారు. అనంతపురం, కర్నూలు, చిత్తూరు జిల్లాల్లో 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందించాలనే లక్ష్యంతో హంద్రీ-నీవా పథకం ఏర్పాటు చేశారన్నారు. కానీ ఇంత వరకు హంద్రీనీవా లక్ష్యం పూర్తిస్థాయిలో నెరవేరలేదన్నారు. హంద్రీ-నీవా ద్వారా ఉమ్మడి అనంత జిల్లాలోని 3.50 లక్షల ఎకరాలకు నీరందించడంతో పాటు కుందిర్పి బ్రాంచ్ కెనాల్ నుంచి 114 చెరువులకు, బీటీపీ ప్రాజెక్టుకు సాగునీరు ఇవ్వాడానికి సంబంధించిన పిల్ల కాలువలను ఏర్పాటు చేయాలన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావడానికి కాలవ, శివరామిరెడ్డి కలిసి రావాలని కోరారు. సీపీఐ నాయకులు బీ.గోవిందు, ఎం.వీరభద్రస్వామి, మహేష్, గోపీనాథ్, ఎస్‌ఎండీ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తిరంగా ర్యాలీ





ర్యాలీ నిర్వహిస్తున్న గేట్స్ విద్యార్థులు, పుట్లూరులో తిరంగా యాత్ర నిర్వహిస్తున్న దృశ్యం

గుత్తి: పట్టణంలో శనివారం గేట్స్ ఇంజనీరింగ్ కాలేజీ విద్యార్థుల ఆధ్వర్యంలో తిరంగా ర్యాలీ నిర్వహించారు. గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి పచ్చ జెండా ఊపి ర్యాలీని ప్రారంభించారు. అనంతపురం రోడ్డులో నుంచి ఎన్టీఆర్ సర్కిల్ వరకు జై జవాన్, జై కిసాన్, భారత్ మాతాకీ జై, అమర్ రహే మురళీ నాయక్ అంటూ నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా గేట్స్ ఎండీ రఘునాథ్ రెడ్డి మాట్లాడుతూ ఆపరేషన్ సిందూర్‌తో భారత సైనికులు తమ సత్తాను ప్రపంచనానికి చాటారన్నారు. భారత సైనికులను ఎప్పటికీ గుర్తు పెట్టుకోవాలన్నారు. కార్యక్రమంలో గేట్స్ ప్రిన్సిపాల్ సుధాకర్, ఏఓ ఇంతియాజ్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్లూరు: మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో శనివారం తిరంగా యాత్ర నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు, ప్రజలు స్వచ్ఛందంగా ఈ కార్యక్రమంలో పాల్గొని, దేశ రక్షణదళాలు సాధించిన విజయాన్ని కొనియాడారు. కార్యక్రమంలో అధికారులు, ప్రజా ప్రతినిధులు, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నట్టల నివారణకు చర్యలు తీసుకోండి

బుక్కరాయసముద్రం: రైతులు గొర్రెల్లో నట్టల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని రెడ్డిపల్లి కృషి విజ్ఞాన కేంద్రం వెటర్నరీ శాస్త్రవేత్త డాక్టర్ మాధవి పేర్కొన్నారు. ఈ మేరకు ఆమె ఓ ప్రకటన విడుదల చేశారు. రైతులకు వ్యవసాయంతో పాటు గొర్రెల పెంపకం కూడా ఎంతో లాభదాయకంగా ఉంటుందన్నారు. గొర్రెలు చిన్నగా ఉన్న గడ్డి తింటాయని, ఆ గడ్డిపై నట్టలు (ఏలిక పాములు, జలిగలు, బద్దె పురుగులు) ఉంటాయన్నారు. వర్షాకాలంలో నట్టల గుడ్ల నుంచి లార్వా దశలోకి మారి గడ్డి ద్వారా గొర్రెలు, మేకల శరీరంలోకి ప్రవేశిస్తాయన్నారు. గొర్రెల్లో నట్టలు ఉన్నట్లు అయితే విరేచనాలు అవుతాయన్నారు. శరీరంపై వెంట్రుకలు పెరిగి బలహీనంగా మారుతాయన్నారు. నట్టలు శరీరం నుంచి రక్తం పీల్చుడం వల్ల రక్తహీనత కలిగి ఉంటాయన్నారు. జలిగలు ఉన్నట్లయితే దవడ కింద వాపు కలిగి ఉంటుందని, గొర్రెల్లో నట్టల నివారణ మందు తాగిడంచడం వల్ల ఆరోగ్యంగా ఉంటాయన్నారు.

అక్కపై దాడి చేసిన తమ్ముడిపై కేసు

యాడికి: అమ్మ కమ్మలు ఇవ్వాలని అడిగిన అక్కపై తమ్ముడు దాడి చేసి, తీవ్రంగా గాయపరిచిన సంఘటన శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. మండలంలోని పుప్పాల గ్రామానికి చెందిన యర్రమ్మకు కూతురు రమాదేవి, కుమారుడు నాగేంద్ర ఉన్నారు. వీరికి వివాహాలు కావడంతో గ్రామంలోనే నివసిస్తున్నారు. 20 రోజుల క్రితం యర్రమ్మ అనారోగ్యంతో మృతి చెందింది. గతంలో కమ్మలు ఇస్తానని యర్రమ్మ తన కూతురు రమాదేవికి హామీ ఇచ్చింది. ఇటీవల తల్లి యర్రమ్మ మృతి చెందడంతో కమ్మలు ఇవ్వాలని తమ్ముడు నాగేంద్రను రమాదేవి కోరింది. కోపంతో ఊగిపోయిన నాగేంద్ర రమాదేవిపై దాడి చేశాడు. ఈ ఘటనలో ఆమె కంటికి గాయాలయ్యాయి. రమాదేవి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఎనుమును ఢీ కొన్న కారు

పామిడి: రామరాజుపల్లి గ్రామ సమీపాన 44 నంబర్ జాతీయ రహదారిపై శనివారం కారు ఎనుమును ఢీకొంది. అనంతపురం నుంచి హైదరాబాద్ వెళ్తున్న కారు రామరాజుపల్లి రోడ్డు దాటుతున్న ఎనుమును ఢీకొంది. ఘటనలో ఎనుము కాలు విరిగింది.

యోగాంధ్రపై సమీక్ష

యల్లనూరు: మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ వాసుదేవ రెడ్డి ఆధ్వర్యంలో యోగాంధ్రపై సమీక్ష నిర్వహించారు. యోగాంధ్రపై పలు ముఖ్యమైన అంశాలపై మాట్లాడారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 పరమేశ్వర రెడ్డి, పీఆర్ జేఈ నరేంద్ర, హౌసింగ్ ఏఈ సుప్రజ, వైద్యాధికారి లోకేష్, ఏపీఓ సత్యమూర్తి హాజరైనారు.

ఆదమరిస్తే తప్పదు మూల్యం



రహదారిపై ప్రమాదకరంగా ఉన్న బారికేడ్లు

తాడిపత్రి రూరల్: పట్టణంలోని శ్రీనివాసపురంలోని ఓగేటి పెట్రోల్ బంకు వద్ద తాడిపత్రి-అనంతపురం రోడ్డుపై ఉన్న బారికేడ్లు ప్రమాదకరంగా మారాయి. కొన్ని రోజుల క్రితం రెండు చోట్ల అండర్ డ్రైనేజీ మ్యాన్‌హోల్స్ కవర్ దెబ్బతినడంతో బారికేడ్లను ఏర్పాటు చేశారు. కొత్త కవర్లను ఏర్పాటు చేసినా బారికేడ్లను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. రద్దీగా ఉన్న రహదారి కావడంతో వాహనాలు తగిలి బారికేడ్లు దెబ్బతిన్నాయి. ప్రస్తుతం ప్రమాదకరంగా మారినా పట్టించుకోవడం లేదు. ఏమాత్రం ఆదమరిచినా వాహనాలు వాటికి తగిలి ప్రమాదానికి గురయ్యే అవకాశం లేకపోలేదు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయండి

బుక్కరాయసముద్రం: ప్రస్తుతం సమాజంలో ప్రతి ఒక్కరూ పర్యావరణ పరిరక్షణ కోసం కృషి చేయాలని మండల ఎంపీడీఓ సాల్మాన్ పేర్కొన్నారు. శనివారం పర్యావరణ దినోత్సవాన్ని పురస్కరించుకుని ర్యాలీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ సాల్మాన్, ఎంపీపీ సునీత హాజరై మాట్లాడారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటాలన్నారు. మొక్కలు పెంచడం వల్ల వర్షాలు సమృద్ధిగా కురుస్తాయన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జూన్-5వరకు పర్యావరణ దినోత్సవంపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఈఓఆర్డీ సదాశివం, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

పడిపోతే ప్రమాదమే..

పెద్దపప్పూరు: మండలంలోని కమ్మవారిపల్లి-నగరూరు రోడ్డు మార్గంలో కాలువ సమీపంలో రోడ్డు పక్కన విద్యుత్ స్తంభం ఓ వైపు ఒరిగి ప్రమాదకరంగా తయారైంది. ఎప్పుడు కూలుతుందో అని రైతులు భయాందోళనకు గురవుతున్నారు. వాలిన విద్యుత్ స్తంభం పొరపాటున ఈదురు గాలులకు పడిపోతే అగ్ని ప్రమాదాలు చోటుచేసుకునే అవకాశం ఉంది. మండల వ్యాప్తంగా పలుచోట్ల విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు. విద్యుత్ స్తంభాలను సరిచేయడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముందస్తు జాగ్రత్తగా విద్యుత్ స్తంభాలను మార్చాలని స్థానికులు కోరుతున్నారు.



కమ్మవారిపల్లి సమీపంలో ఓ వైపు ఒరిగిన విద్యుత్ స్తంభం

ఇసుక టిప్పరు పట్టివేత

శింగనమల: మండలంలోని కల్లుమడి సమీపంలోని పెన్నానది నుంచి అక్రమంగా ఇసుక తరలిస్తున్న టిప్పరును పట్టుకున్నట్లు ఎస్‌ఐ విజయ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం రాత్రి ఇసుక తరలిస్తుండగా పట్టుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

జూన్ 2న 'యోగాంధ్ర'



యోగా కార్యక్రమం జరిగే ప్రాంతాన్ని పరిశీలిస్తున్న కమిషనర్

గుత్తి: గుత్తి కొండలోని గుర్రపు శాలలో జూన్ 2న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ ఆధ్వర్యంలో యోగాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహిస్తామని మున్సిపల్ కమిషనర్ జబ్బార్ మియా చెప్పారు. గుత్తి కొండలో యోగాంధ్ర కార్యక్రమం జరుగనున్న ప్రాంతాన్ని ఆయన మున్సిపల్ అధికారులు, గుత్తి కోట సంరక్షణ సమితి అధ్యక్షులు విజయ భాస్కర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమానికి అధికారులు, ప్రజా సంఘాలు, ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

నేడు భోగేశ్వరాలయంలో మాస శివరాత్రి

పామిడి: పట్టణ ప్రముఖ శైవక్షేత్రమైన భోగేశ్వరాలయంలో ఆదివారం సాయంత్రం 6 గంటలకు మాస శివరాత్రి వేడుకలను నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు దేవగుడి రామేశ్వరశర్మ, కమిటీ సభ్యులు కవి నారాయణమూర్తి శనివారం తెలిపారు. ఈసందర్భంగా ఆదిదంపతులైన శివపార్వతి దేవతామూర్తులకు అభిషేకార్చన, పల్లకీసేవ, ప్రాకారోత్సవ కార్యక్రమాలు ఉంటాయన్నారు.

మోడల్ డీఎస్సీ నిర్వహణ హర్షణీయం

గుంతకల్లు: డీఎస్సీ అభ్యర్థులకు ఉపయోగపడేలా మోడల్ డీఎస్సీ నిర్వహించడం అభినందనీయమని టూటౌన్ సీఐ ఏపీ మస్తాన్ పేర్కొన్నారు. శనివారం స్థానిక శ్రీశైల భ్రమరాంబ డిగ్రీ కళాశాలలో ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో మోడల్ డీఎస్సీ పరీక్షలను నిర్వహించారు. డీఎస్సీ అభ్యర్థుల్లో భయాందోళన పోగొట్టడానికి మోడల్ పరీక్షలు ఉపయోగపడుతాయన్నారు. కార్యక్రమంలో ఎస్సార్ ఎడ్యుకేషన్ సొసైటీ కార్యదర్శి రాయల్‌రంగ, ప్రిన్సిపాల్ వసుంధర పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత మృతి



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

గుత్తి రూరల్: రజాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నేత షేక్.చిన్న షేక్షావలి సాహెబ్(72) శనివారం అనారోగ్యంతో బాధపడుతూ మృతి చెందాడు. గ్రామానికి చెందిన షేక్షావలి పార్టీ ఆవిర్భావం నుంచి క్రియాశీలకంగా వ్యవహరించేవారు. ఆయన కుమారుడు షేక్.హాజీమలంగ్‌బాబా ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ గుత్తి మండల ముస్లిం మైనార్టీ అధ్యక్షుడిగా ఉన్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ గుత్తి పట్టణ కన్వీనర్ కప్పలబండ మధుసూదన్‌రెడ్డి, నాయకులు గోవర్ధన్‌రెడ్డి, సుభాష్‌రెడ్డి, మహాలింగ, విరుపాక్షిరెడ్డిలు గ్రామానికి చేరుకొని చిన్న షేక్షావలి మృతదేహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మృతుడి కుమారుడిని గుంతకల్లు సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే వై.వెంకట్రామిరెడ్డి ఫోన్‌లో పరామర్శించి ధైర్యం చెప్పారు.

200 క్వింటాళ్ల విత్తన వేరుశనగ సరఫరా

గార్లదిన్నె: మర్తాడు,కోటంక గ్రామాల్లో రైతు సేవా కేంద్రాలకు 200 క్వింటాళ్లు విత్తన వేరుశనగ శనివారం చేరినట్లు ఏఓ సోమశేఖర్ తెలిపారు. ఏఓ మాట్లాడుతూ మండలానికి 1000 క్వింటాళ్లు విత్తన వేరుశనగ సరఫరాకు ప్రతిపాదనలు పంపామన్నారు. ప్రస్తుతం ఒక్కో రైతు సేవా కేంద్రానికి 100 క్వింటాళ్లు చొప్పున రెండు రైతు సేవా కేంద్రాలకు వేరుశనగ విత్తన కాయలు సరఫరా అయ్యాయన్నారు.